సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం । 23 । ఆగస్టు । 2025



సోషల్ మీడియా ప్రచారం నమ్మవద్దు

మదనపల్లె మండలం నల్లగుట్టలో గౌతమ బుద్ధ విగ్రహ పునఃప్రతిష్టకు తరలిరావాలని సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారం నమ్మవద్దని అధికారులు తెలిపారు. -8లో



రామాలయానికి రాజకీయ రంగు

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయం వద్ద టీడీపీ బ్యానర్లను ఆ పార్టీ శ్రేణులు కట్టడంపై భక్తులు మండిపడుతున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.380	రూ.500
రెండోరకం	రూ.200	రూ.370

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 103 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	600	630
బైవోల్టిన్	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 155.260 కిలోలు

న్యూస్‌రీల్

24న షూటింగ్‌బాల్ జట్ల ఎంపిక

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణ సమీపాన ఉన్న పుంగనూరురోడ్డులోని గ్రీన్‌వ్యాలీ పాఠశాలలో ఈ నెల 24న జిల్లా బాల,బాలికల షూటింగ్‌బాల్ జట్ల ఎంపిక జరుగుతుందని జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గౌతమి తెలిపారు. క్రీడాకారులు ఉదయం 9 గంటలకు హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు. 2006 ఏప్రిల్ 1 తరువాత పుట్టిన వారు అయి ఉండాలన్నారు. ఆధార్‌కార్డు తీసుకుని రావాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ : 6281881022ను సంప్రదించాలని వివరించారు.

మాతా శిశుమరణాల నివారణే లక్ష్యం



వైద్యులకు శిక్షణలో మాట్లాడుతున్న డీఐఓ ఉషశ్రీ

రాయచోటి: మాతా శిశు మరణాల తగ్గింపే లక్ష్యంగా వైద్యులు, వైద్య సిబ్బందికి శిక్షణలు ఇస్తున్నట్లు డీఐఓ డాక్టర్ ఉషశ్రీ తెలిపారు. రాయచోటిలోని కె.రామాపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లాలోని పీహెచ్‌సీ, యూసీహెచ్‌సీలలో పని చేస్తున్న వైద్యులకు సమీకృత ఎక్కువ ప్రమాదం గల గర్భిణుల జాడను గుర్తించి వారికి సుఖ ప్రసవం నిర్వహించడంపై రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. శుక్రవారం ముగింపు కార్యక్రమానికి డీఐఓ హాజరై మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన వారు జిల్లాలో పని చేస్తున్న వైద్యులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు డాక్టర్ కిజియా, డాక్టర్ లీలా, వైద్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి రామచంద్రారెడ్డి

లక్కిరెడ్డిపల్లి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి రామచంద్రారెడ్డి సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని కోరంపేట దేవలంపల్లి పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ఆయన పర్యటించి దోమల నివారణపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించేలా గ్రామాల్లో ప్రజలకు తెలియజేసి అవగాహన కల్పించాలని సూచించారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గున్యా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. ఈయన వెంట సబ్ యూనిట్ ఆఫీసర్ జి.జయరామయ్య, పి.రవీంద్ర, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బి.రేఖ నాయక్, డి.దేవాదానం, ఎంపీహెచ్‌ఈఓ, ఆరోగ్య కార్యకర్తలు ఓబులేశు, రాజేంద్ర ప్రసాద్, క్రిస్టపర్వి, బీబీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

12 అంశాలతో కళా ఉత్సవ్ పోటీలు



కళా ఉత్సవ్ రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తున్న నోడల్ అధికారి నరసింహారెడ్డి

రాయచోటి జగదాంబసెంటర్: విద్యార్థుల్లో కళాత్మక నైపుణ్యాలు పెంపొందించడమే లక్ష్యంగా 12 అంశాలతో కళా ఉత్సవ్ – 2025 పోటీలు నిర్వహిస్తున్నట్లు కళా ఉత్సవ్ జిల్లా నోడల్ అధికారి మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. స్థానిక డైట్ కళాశాలలో కళా ఉత్సవ్ – 2025కు సంబంధించిన రిజిస్ట్రేషన్లను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, నాటకం, దృశ్యకళలు, సంప్రదాయ కథ చెప్పడం వంటి 12 అంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి కడప జిల్లాలోని 50 మండలాలకు చెందిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 9, 10, 11, 12వ తరగతుల విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని వివరించారు. పోటీల్లో పాల్గొనే వారు రాయచోటి డైట్ కళాశాలలో వ్యక్తిగతంగా గానీ 9440246825 నంబర్‌కు వాట్సాప్ ద్వారా గానీ, గూగుల్ ఫామ్ ద్వారా గానీ తమ పేర్లు నమోదు చేసుకోవాలని వివరించారు.

యూరియా.. ఇవ్వయ్యా!

- రైతు సేవా కేంద్రాల్లో నోస్టాక్
- నిలువు దోపిడీ చేస్తున్న వ్యాపారులు
- రైతులను వేధిస్తున్న ఎరువుల కొరత

గుర్రంకొండ: జిల్లాలోని రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లోనూ యూరియా కొరత ఏర్పడింది. నెలన్నర రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. జిల్లాకు చెందిన రైతులతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి రైతులు యూరియా కోసం తరలివస్తుండటం గమనార్హం. దీంతో బ్లాక్ మార్కెట్లో బస్తా రూ.350 నుంచి రూ.370 వరకు విక్రయిస్తున్నారు. కొంత మంది డీలర్లు యూరియాను బ్లాక్ చేసి అధిక ధరకు విక్రయిస్తున్నారు.

నెలన్నర రోజులుగా కొరత

జిల్లాలోని 452 రైతు సేవా కేంద్రాలతోపాటు పలు ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో నెలన్నర రోజులుగా ఎరువుల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ప్రస్తుతం పొటాష్, జిప్సమ్ మాత్రమే రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచారు. మరికొన్ని చోట్ల వాటితోపాటు మిగిలిన ఎరువులు 40 శాతం మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో జిల్లాలోని రైతులు ఆరుతడి పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. అయితే రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ ఎరువులు అంతంత మాత్రంగానే అందుబాటులో ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచేవారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల్లో డీఏపీ, కాంప్లెక్స్‌ల స్టాకు అంతంత మాత్రంగానే ఉండగా.. యూరియా మాత్రం అందుబాటులో లేకపోవడం గమనార్హం.

కనిపించని సమాచార బోర్డులు

జిల్లాలో రైతులను ప్రైవేట్ ఎరువుల డీలర్లు ఇష్టారాజ్యంగా నిలువు దోపిడీ చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై చాలా రోజులు కావడంతో రైతులు వ్యవసాయ పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. రైతు సేవా కేంద్రాల్లో అంతంత మాత్రంగానే ఎరువులు ఉండటంతో రైతులు ప్రైవేట్ ఎరువుల దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. ముఖ్యంగా యూరియా కొరత ఎక్కువగా ఉండటంతో.. ఇదే అదనుగా భావించి డీలర్లు రైతులకు అధిక ధరకు ఎరువులు విక్రయిస్తూ దోచుకొంటున్నారు. జిల్లాలో పలు దుకాణాల ముందు ఎరువులు, విత్తనాల ధరలు గానీ, స్టాకు సమాచారం, ధరలు తెలియజేసే సమాచార బోర్డులు ఉంచడం లేదు. కొన్ని దుకాణాల వద్ద బోర్డులు ఉన్నా.. అందులో సమాచారం మాత్రం ఖాళీగా దర్శనమిస్తోంది. తాము కొనుగోలు చేసే ఎరువులకు, పురుగుల మందులకు రసీదులు ఇవ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ ఎరువులు, విత్తనాల వల్ల నష్టపోతే.. తాము డీలర్ల దగ్గర కొన్నట్లు ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో చేసేదేమీలేక లబోదిబోమంటున్నారు.



యూరియా బస్తాల స్టాకు లేని రైతు సేవా కేంద్రం

జిల్లాలో రైతు సేవా కేంద్రాలు, ఎరువుల దుకాణాల సంఖ్య, ఎరువుల స్టాక్ వివరాలు

రైతు సేవా కేంద్రాలు: 452

ఎరువుల స్టాకు: జిప్సం, పొటాష్‌తోపాటు మిగిలిన ఎరువులు 40 శాతమే, యూరియా నో స్టాక్

ప్రైవేట్ ఎరువుల దుకాణాలు : 484

ఎరువుల స్టాక్: అన్ని రకాల ఎరువులు ఫుల్, యూరియా బ్లాక్ మార్కెట్



కర్ణాటక నుంచి వస్తున్న రైతులు

జిల్లాలోని పడమటి ప్రాంతాలు కర్ణాటక రాష్ట్రానికి దగ్గరగా ఉన్నాయి. మన జిల్లాతోపాటు కర్ణాటక రాష్ట్రంలోనూ యూరియా కొరత ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో మన జిల్లా సరిహద్దులో ఉన్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన రైతులు యూరియా కోసం జిల్లాకు తరలివస్తున్నారు. దీంతో కొంత మంది ప్రైవేట్ డీలర్లు ఇష్టానుసారంగా ధర పెంచేసి వారిని నిలువు దోపిడీ చేస్తున్నారు. అధిక ధరలు చెల్లించే వారికి కోరినన్ని యూరియా బస్తాలను డీలర్లు అప్పజెప్పుతుండటం గమనార్హం. కొంత మంది డీలర్లు తమ వద్ద ఉన్న యూరియాను బ్లాక్ చేసి మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టించి.. ఇష్టానుసారంగా ధర పెంచేసి రైతులకు విక్రయిస్తున్నారు. ఇప్పటికే పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక విలవిలలాడుతున్న రైతాంగానికి అధిక ఎరువుల ధరలు పెనుభారంగా మారాయి.

అధిక ధరకు విక్రయం

యూరియా కొరతను దృష్టిలో ఉంచుకొని ప్రైవేట్ డీలర్లు అధిక ధరకు విక్రయిస్తున్నారు. ముఖ్యంగా జిల్లాలో పడమటి ప్రాంతాలైన మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో డీలర్లు ఇష్టానుసారంగా ధర పెంచేసి యూరియాను విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. బాగా పరిచయం ఉన్న రైతులకు బస్తా యూరియా ధర రూ. 300కు, బయటి ప్రాంతాల నుంచి వచ్చే వారికి రూ.350 నుంచి రూ.370 వరకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకు యూరియా బస్తా రూ.267కు విక్రయించాల్సి ఉంది. అయితే రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకొని డీలర్లు ధర పెంచేసి యూరియాను విక్రయిస్తుండటం గమనార్హం. అందులో రైతులకు ఒకటి లేదా రెండు బస్తాలను మాత్రమే డీలర్లు విక్రయిస్తున్నారు. దీంతో చాలీచాలని యూరియాతో వ్యవసాయం చేయడం భారంగా మారిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



యూరియాను అధిక ధరకు విక్రయించే డీలర్లపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం నిర్దేశించిన ధరకే యూరియాను విక్రయించాలి. రైతు సేవా కేంద్రాలకు అవసరమైన యూరియా కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. స్టాకు రాగానే రైతులకు అవసరమైనన్నీ బస్తాలు పంపిణీ చేస్తాం. – రత్నమ్మ, ఏవో, గుర్రంకొండ

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఛామకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి: జిల్లాలో రసాయనిక ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్సు హాల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ యూరియా కొరత రానివ్వకుండా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో రసాయనిక ఎరువులు కృత్రిమ కొరత సృష్టించే డీలర్లు, సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రసాయనిక ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, తగినన్ని నిల్వలు లేవని నివారించినా సంబంధిత సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాలలో అవసరమైన రసాయనిక ఎరువుల కొరత రానీవ్వకుండా సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. అన్ని మండలాల్లో బృందాలు ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. రైతుల డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని అనవసరమైన వేరే ఉత్పత్తులను, పోషకాలను లింక్ చేసి అమ్మితే చర్యలు తీసుకొని, వారి లైసెన్సును రద్దు చేస్తామని హెచ్చరించారు. ఒక ఎకరాకు ఒక యూరియా బస్తా సరిపోతుందని రైతులు ఆందోళన చెందకుండా అవసరం మేరకు వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఛామకూరితోపాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్‌ఓ మధుసూదన్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి శివ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక

ప్రత్యేక నిపుణుల బృందం పరిశీలన

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయ అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు ప్రత్యేక నిపుణుల బృందం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం ఒంటిమిట్టలో ఎక్కడెక్కడ ఏ పనులు చేస్తే భక్తులకు సౌకర్యంగా ఉంటుందో టీటీడీ సివిల్ విభాగం అధికారులతో కలిసి ప్రత్యేక నిపుణుల బృందం ప్రణాళిక అధికారి రాముడు, ఆర్కిటెక్చర్ అనిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా రామాలయ పరిసరాల్లోని రామకుటీరం, శృంగిశైలి పర్వతం, ఒంటిమిట్ట చెరువు, రామతీర్థం, నాగేటితిప్ప పర్వతం, కల్యాణ వేదిక ప్రాంతం, వావిలి కొలను సుబ్బారావు కుటీరాన్ని సందర్శించారు. అనంతరం ప్రణాళిక అధికారి రాముడు మాట్లాడుతూ విజయవాడలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ నిపుణుల సంస్థ వారి పరిశీలనలో ఎక్కడ అభివృద్ధి జరిగితే భక్తులకు సౌకర్యంగా ఉంటుందో ప్రణాళిక రూపొందించి రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ పరిశీలనలో అన్నదాన కాంప్లెక్స్, క్యూ కాంప్లెక్స్, ఒంటిమిట్ట చెరువును ట్యాంక్ బండ్ చేయడం, చెరువులో శ్రీరాముడి భారీ విగ్రహం ప్రతిష్టించడం, శృంగిశైలి పర్వతం చుట్టూ గిరి ప్రదక్షిణ చేయించడం, శ్రీరామ ప్రాజెక్ట్, పార్వేటి ఉత్సవం జరిగే నాగేటి తిప్ప పర్వతాన్ని అందంగా తీర్చిదిద్దడం, ఒంటిమిట్ట క్షేత్రానికి విచ్చేసే భక్తులు ఉండేందుకు వసతులు కల్పించడం , ఒంటిమిట్టలో ఎండ తీవ్రతను తగ్గించేందుకు ఎక్కువ ప్లాంటేషన్ చేయించి, సాధారణ ఉష్ణోగ్రత కంటే 6 డిగ్రీలు తగ్గించేలా చర్యలు తీసుకోవడం వంటివి తమ దృష్టిలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో ప్రశాంతి, సివిల్ విభాగం ఎస్ఈ మనోహర్, ఈఈ సుమతి, ఏఈ అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



అభివృద్ధి ప్రణాళిక మ్యాప్ పరిశీలిస్తున్న నిపుణుల బృందం

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

రాయచోటి: ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యతగా పరిగణించి పరిష్కరించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో గ్రీవెన్స్ డే కార్యక్రమంలో వారు ఉద్యోగుల సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పారదర్శకంగా పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉద్యోగులు తమ బాధ్యతలను గుర్తించి మరింత సమర్థవంతంగా పని చేయాలని ఆదేశించారు. వేతనాల చెల్లింపు, బదిలీలకు సంబంధించిన అర్జీలే అధికంగా వచ్చినట్లు తెలిపారు. అన్ని సమస్యలను శ్రద్ధగా విని సంబంధిత శాఖాధికారులను తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పరిష్కార చర్యలు

వివిధ మండలాల నుంచి ఐదుగురు వీఆర్‌ఓలు డిప్యుటేషన్ నిమిత్తం దరఖాస్తు చేసుకోగా కలెక్టర్ అంగీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని డీఆర్‌ఓకు ఆదేశాలు జారీ చేశారు. వివిధ కారణాలతో సస్పెండ్ అయిన నలుగురు ఉద్యోగులను రీ-ఇన్సియేషన్ చేసేందుకు ఫైల్ సర్క్యూట్ చేయాలని డీఆర్‌ఓను ఆదేశించారు. పీటీఎం మండలంలో తహసీల్దార్ వీఆర్‌ఓగా విధుల్లో చేర్చుకోవడం లేదని బాధితుడు దరఖాస్తు సమర్పించగా.. వెంటనే విధుల్లో చేర్చుకోవాల్సిందిగా జారీ చేయాలని కలెక్టర్ డీఆర్‌ఓను ఆదేశించారు. వీఆర్‌ఓ మంజునాథ్ 2016లో పరీక్షల నిమిత్తం సెలవుపై వెళ్లినందుకు ఆ సెలవును రెగ్యులరైజ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని డీఆర్‌ఓను ఆదేశించారు. డిజిటల్ అసిస్టెంట్ గోపాల్ నాయక్ కెవిపల్లి మండలం నుంచి పీలేరు ప్రాంత సమీపంలో మార్పు చేయాలని దరఖాస్తు చేసుకోగా తగు చర్యలు తీసుకొని మార్పు చేయాలని డీపీఓను కలెక్టర్ ఆదేశించారు. మరో ఇరవై మంది ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించి ఉద్యోగులకు భరోసా కల్పించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ మధుసూదన్ రావు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగుల వినతి పత్రాలు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్

స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్రలో ముందుండాలి

స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్రలో రాష్ట్రంలోనే మన జిల్లా ముందుండాలని కలెక్టర్ శ్రీధర్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌తో కలిసి స్వామిత్వ, శానిటేషన్, సాసా, కౌసల్యం సర్వే, హౌసింగ్, పెన్షన్ తదితర అంశాలపై రాజంపేట, మదనపల్లె ఆర్‌డీవోలతోపాటు ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. శానిటేషన్ మెరుగుదలకు ప్రతి 250 ఇళ్లకు ఒక గ్రీన్ ఎంబాసిటర్ నియామకం తప్పనిసరని సూచించారు. పంచాయతీ సెక్రటరీలు ప్రతి రోజు ఉదయం 6-8 గంటల మధ్య ఫీల్డ్ పరిశీలన చేసి చెత్త సేకరణ పర్యవేక్షణ చేయాలన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో కాలేజీలు, పాఠశాలలు, హాస్టళ్లలో వ్యాసరచన పోటీలు నిర్వహించి, ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు తోడేస్తున్నారు..!

కొండలు.. గుట్టలు.. వాగులు.. వంకలు.. ఏవైనా టీడీపీ నాయకుల అక్రమ దోపిడీకి విలవిలలాడుతున్నాయి. ఇసుక, మట్టిని నిబంధనలకు విరుద్ధంగా తవ్వుకుని.. అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. కూటమి ఏడాదిన్నర పాలనలోనే అక్రమార్కులు ఎంత బరి తెగించారో.. తవ్విన ప్రదేశాల్లో ఏర్పడిన గోతులు చూస్తేనే తెలుస్తోంది. వాటి వద్ద ఎలాంటి రక్షణ చర్యలు లేక ప్రమాదకరంగా మారాయి. గోతుల్లో నీరు నిలవడంతో.. సరదాగా ఈతకు అని దిగిన అమాయకుల ప్రాణాలు తీస్తున్నాయి.

- మృత్యుకుహరాలుగా మారిన గోతులు
- ఇసుక, మట్టిని దోచేస్తున్న తమ్ముళ్లు
- ప్రమాదకరంగా నదులు, చెరువులు, వాగులు


రాయచోటి: నదుల్లో నీటి ప్రవాహం పెరగడంతో పరీవాహక ప్రాంతాలకు సరదాగా ఈత కోసం వెళ్లిన యువతీ యువకులు ప్రాణాలు కోల్పోతున్నారు. పచ్చనేతలు తోడేసిన ఇసుక మడుగులు వారిని బలి తీసుకుంటున్నాయి. ఇసుక, మట్టితో పచ్చ నేతలు కోట్ల రూపాయలు ఆర్జిస్తుండగా.. విహార యాత్రలకు, పశువుల కాపర్లుగా వెళ్లిన వారు అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు. ఇంచుమించు కొంత కాలంగా ఈ తరహా ఘటనలు ప్రధానంగా పెన్నా, బహుదా, చెయ్యేరు, పాపాఘ్ని తదితర నదుల మడుగుల్లో వెలుగు చూస్తున్నాయి. మొన్న నెల్లూరు, చిన్న నంద్యాల ఘటనలు మరువకముందే అన్నమయ్య జిల్లాలోని బహుదా నదిలో ఊబిలను తలపించే మడుగుల్లో.. బంగారు భవిష్యత్తు ఉన్న ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థులు గల్లంతయ్యారు. ఈ మధ్యకాలంలో ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని నదులు ప్రవహిస్తున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలో పచ్చ నేతల కనుసన్నల్లో ఇసుక, మట్టి చోరీకి గురైంది. జిల్లాలోని బహుదా, పింఛా, చెయ్యేరు, పెన్నా, మాండవ్య, పాపాఘ్ని నదుల్లో ఎక్కడ చూసినా బావులు, మడుగులను తలపించేలా గుంతలు కనిపిస్తున్నాయి. సరదా కోసం వెళ్లిన యువతీ యువకుల ప్రాణాలను తీస్తున్నది పచ్చ నేతలు తవ్విన ఇసుక మడుగులేనన్న విమర్శలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లోనే గురువారం రాజంపేట సమీపంలోని చెయ్యేరు నదిలో అన్నమాచార్య యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్న సాంబత్తిన దిలీప్ (22), కె.చంద్రశేఖర్(22), పి.కేశవ (22)లు ఇసుక మడుగుల్లో ప్రాణాలు వదిలారు.



బాలరాచపల్లె సమీపంలోని బహుదానదిలో ప్రమాదకరంగా కనిపిస్తున్న మడుగులు



చెయ్యేరు నదిలో ఇసుకను తోడేసిన దృశ్యం (ఫైల్)



నదులు, చెరువులను చెరబట్టిన పచ్చ నేతలు

కూటమి ప్రభుత్వం పాలన ప్రారంభమైన నాటి నుంచి జిల్లాలోని నదులు, చెరువులలోని ఇసుక, మట్టిని చెరబట్టారు. విచ్చలవిడిగా జేసీబీ, ఈటాచ్, బుల్డోజర్లతో నదీగర్భాన్ని చీల్చి టిప్పర్లు, లారీల సాయంతో ఇసుక, మట్టిని దోచుకెళ్లి నదులు, వాగులు, వంకలు, చెరువులకు గర్భశోకాన్ని మిగిల్చారు. అధికారులు ముందుగా గుర్తించి ఇసుక రీచ్‌లను ఎంపిక చేసిన ప్రాంతాలలో.. మనుషుల సాయంతో ట్రాక్టర్లకు ఎత్తుకుని నదుల నుంచి ఇసుకను తరలించాల్సి ఉంది. రీచ్‌లను అధికార బలంతో దక్కించుకున్న తెలుగు తమ్ముళ్లు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి.. యంత్రాలతో విచ్చలవిడిగా తరలించి ధన దాహం తీర్చుకుంటున్నారు.



చెయ్యేరు నదిలో మృతి చెందిన యువకులు (ఫైల్)

జాగ్రత్తలు పాటించాలి

ప్రకృతి అందాలు, నదీ ప్రవాహాలు, ప్రాజెక్టుల వీక్షణలో యాత్రికులు తగు జాగ్రత్తలు పాటించాలి. ఇలాంటి ప్రమాదాల నివారణకు అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

సుండుపల్లె : బాల్య వివాహాన్ని ప్రభుత్వ అధికారులు శుక్రవారం అడ్డుకున్న సంఘటన సుండుపల్లె మండలంలో చోటుచేసుకుంది. వివరాలలోకి వెళ్లితే.. బాల్యవివాహాల టోల్‌ఫ్రీ నంబర్ 1098కి ఫిర్యాదు రాగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాల మేరకు మండల పరిధిలోని ముడుంపాడు గ్రామం క్రాస్‌లో ఓ మైనర్ బాలికకు రాయవరం గ్రామానికి చెందిన 26 సంవత్సరాల వ్యక్తితో ఆదివారం వివాహం చేయడానికి మాట్లాడుకుంటున్నారని తెలియడంతో బాల్యవివాహాన్ని అడ్డుకున్నట్లు డీసీపీయు పీఓఐసీ రామలక్ష్మీ తెలిపారు. ఎస్‌ఐ ముత్యాల శ్రీనివాసులు, కానిస్టేబుల్ నరసింహులు, నాగేంద్ర, లీగల్ అడ్వైజర్ కైరున్, అంగన్వాడీ సూపర్‌వైజర్ సుశీల, శైలజ, పంచాయతీ సెక్రటరీ రామమోహన్, మహిళా పోలీస్ అనిత, రెడ్డమ్మ, ఓబులమ్మ, సమత, ఎన్‌జీఓ ప్రతినిధి వెంకటయ్య కలిసి మైనర్ బాలిక తల్లిదండ్రులకు బంధువులకు బాల్యవివాహం చేయడం నేరమని, బాల్యవివాహం చేసిన వారు అందుకు సహకరించిన వారు చట్టరీత్యా నేరస్థులవుతారని కౌన్సెలింగ్ ఇచ్చారు.

బోరు మోటార్ వైరు చోరీ


స్టాటర్ వద్ద వైరును కత్తిరించిన దృశ్యం

సంబేపల్లె : మండల పరిధిలోని మోటకట్ల గ్రామం వంగిమళ్ళవాండ్లపల్లెకు చెందిన సహదేవరెడ్డి పొలంలోని వ్యవసాయ బోరుకు సంబంధించి విద్యుత్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు తెలిపారు. బాధితుల వివరాలమేరకు ప్రతి రోజు బోరు బావి నీటితో పొలం పనులు చేసుకొనే వారన్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం వ్యవసాయపనుల నిమిత్తం వ్యవసాయ బోరుబావివద్దకు వెళ్లగా అక్కడ స్టాటర్ నుంచి బోరు మోటార్‌కు వరకు ఉన్న వైరు, లోపలికి వెళ్లు వైరు అదృశ్యమైనట్లు తెలిపారు. తరచూ ఈ సంఘటనలు మండలంలో జరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మదనపల్లెలో ఏసీబీ సోదాలు


కురవంకలో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

మదనపల్లె రూరల్ : పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. కర్నూలు జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసులో ఏఓగా పని చేస్తున్న మూడే బాలునాయక్ ఏసీబీ అధికారులకు పట్టుబడిన నేపథ్యంలో...శుక్రవారం ఉదయం మదనపల్లె పట్టణంలోని కురవంక రవీంద్రనగర్‌లోని బాలూనాయక్ కుమారుడు శ్రీకాంత్ ఇంట్లో ఏసీబీ తిరుపతి సీఐ నరసింహారావు, రామారావుకాలనీలోని వియ్యంకుడు వాలేనాయక్ ఇంట్లో ఏసీబీ సీఐ హమీద్‌ఖాన్ ఆధ్వర్యంలో రెండు బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి. పత్రాలను పరిశీలించారు. అయితే సోదాలకు సంబంధించి మీడియాకు వివరాలు వెల్లడించలేదు.

ఇంటి దారి విషయమై వ్యక్తిపై దాడి

మదనపల్లె రూరల్ : ఇంటి దారి విషయమై కొందరు కలిసి వ్యక్తిపై దాడిచేసిన ఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. కొత్తవారిపల్లె పంచాయతీ ఓబిరెడ్డిగారిపల్లెకు చెందిన చలపతిరెడ్డి కుమారుడు లోకేష్‌రెడ్డి(42)కు తన ఇంటికి దారి విషయమై స్థానికులైన రామకృష్ణారెడ్డి, సోమనాథరెడ్డితో వివాదం ఏర్పడింది. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఈ విషయమై రామకృష్ణారెడ్డి తన అనుచరులు రెడ్డిగానిపల్లెకు చెందిన మునిరాజ, ఓబిరెడ్డిగారిపల్లెకు చెందిన సోమనాథరెడ్డి, రెడ్డెప్పరెడ్డితో కలిసి లోకేష్‌రెడ్డిపై దాడికి పాల్పడి కర్రలతో తీవ్రంగా కొట్టారు. కత్తితో చంపేస్తామని బెదిరించారు. దాడిలో లోకేష్‌రెడ్డి తీవ్రంగా గాయపడగా, స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై తాలూకా పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు బాధితులు తెలిపారు.

ఒంటి మిట్ట రామాలయానికి
రాజకీయ రంగు


రామాలయ సూచిక బోర్డును సైతం టీడీపీ బ్యానర్లతో కప్పేసిన దృశ్యం



ఒంటిమిట్ట రామాలయాన్ని కనిపించకుండా టీడీపీ బ్యానర్లు ఏర్పాటు

- రామాలయ పరిసరాలలో వెలసిన టీడీపీ బ్యానర్లు
- చోద్యం చూస్తున్న టీటీడీ ఆలయ అధికారులు
- బ్యానర్లపై తీవ్రస్థాయిలో మండిపడుతున్న భక్తులు

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయం పచ్చరంగు పులుముకుంది. రాజంపేట టీడీపీ ఇన్‌చార్జ్‌గా చమర్తి జగన్ మోహన్ రాజును పార్టీ అధిష్టానం నిర్ణయించడంతో శుక్రవారం చమర్తి జగన్ మోహన్ రాజు నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో మండల కేంద్రమైన ఒంటిమిట్టలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ నిర్వహణలో భాగంగా గురువారం రాత్రి చమర్తి జగన్ మోహన్ రాజుకు శుభాకాంక్షలు తెలుపుతూ మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఒంటిమిట్టలో భారీ ఎత్తున బ్యానర్లను ఏర్పాటు చేశారు. ఈ బ్యానర్లు ఏర్పాటుకు సంబంధించి తెలుగు తమ్ముళ్లు ఒంటిమిట్ట రామాలయాన్నా కూడా వదలకుండా బ్యానర్లను కట్టారు. దీంతో ఆధ్యాత్మిక శోభ విరాజిల్లాల్సిన దేవాలయం చెంత రాజకీయ రంగు పులవడంపై రామయ్య భక్తులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఇంత జరుగుతున్నా టీడీపీ ఆలయ అధికారులు చోద్యం చూస్తూ నోరు మెదపకపోవడం గమనార్హం.

సోషల్ మీడియా ప్రచారాలను నమ్మవద్దు

- నల్లగుట్టపై కార్యక్రమాలకు అనుమతి లేదు
- ఐదుకిలోమీటర్ల పరిధి వరకు నిషేధాజ్ఞలు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు


మాట్లాడుతున్న తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి, సీఐ కళావెంకటరమణ

మదనపల్లె రూరల్ : మండలంలోని అంకిశెట్టిపల్లె గ్రామ రెవెన్యూ పరిధిలోని నల్లగుట్టలో గౌతమబుద్ధ విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమానికి ప్రజలు తరలిరావాలని సోషల్‌మీడియాలో వ్యాప్తి చేస్తున్న ప్రచారాలను నమ్మవద్దని తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి, సీఐ కళావెంకటరమణ తెలిపారు. శుక్రవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ...పట్టణానికి చెందిన పీటీయం.శివప్రసాద్ ఈనెల 23వతేదీ నల్లగుట్టపైన బుద్ధవిగ్రహ ప్రతిష్టకు ప్రజలు తరలిరావాల్సిందిగా సోషల్‌మీడియాలో ప్రచారం చేస్తున్నారన్నారు. నల్లగుట్ట చుట్టుపక్కల ఐదుకిలోమీటర్ల పరిధి వరకు ఎటువంటి కార్యక్రమాలు చేపట్టరాదని, ప్రజలు గుమికూడరాదని ఎంసీ.నెం.358/2025 కింద 21వ తేదీన నిషేధిత ఉత్తర్వులు జారీ చేశామన్నారు. నిషేధాజ్ఞలు తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంతవరకు కొనసాగుతాయన్నారు. ఈ విషయమై పీటీఎం.శివప్రసాద్, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు వెళితే, ఎటువంటి అనుమతులు ఇవ్వకుండా, అతని ఫిర్యాదును కొట్టివేయడం జరిగిందన్నారు. అంకిశెట్టిపల్లె గ్రామరెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్.15లోని నల్లగుట్ట పూర్తిగా ప్రభుత్వానికి చెందిన భూమి, ఇందులో ఎవరూ ప్రవేశించరాదని కంచెను ఏర్పాటుచేశామన్నారు. శనివారం పట్టణంలో ర్యాలీ, నల్లగుట్టపై బుద్ధుని విగ్రహ ప్రతిష్టకు సంబంధించి ఎలాంటి అనుమతులు లేవని, ఒకవేళ ఎవరైనా ఉల్లంఘనలకు పాల్పడితే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయమై వేసిన కేసును హైకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కోర్టు ధిక్కారం కింద పరిగణిస్తామన్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన
హోంగార్డులకు అభినందనలు


పోలీసులుగా ఎంపికైన వారిని అభినందిస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : హోంగార్డ్స్‌గా పనిచేస్తూనే కానిస్టేబుల్‌గా ఎంపికైన వారిని జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు అభినందించారు. అన్నమయ్య జిల్లా పోలీసు విభాగంలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్స్ ఇటీవల ఏపీ లెవల్ పోలీసు రిక్రూట్మెంట్ బోర్డు నిర్వహించిన కానిస్టేబుల్ నియామక పరీక్షలలో ఎంపికైన ఐదుగురికి ఎస్పీ పుష్పగుచ్ఛాలు, శాలువాలు, సర్టిఫికెట్లతో ప్రత్యేకంగా సన్మానించారు. కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసం ద్వారా విజయాన్ని సాధించగలిగారని కితాబిచ్చారు. హోంగార్డ్స్ నుండి కానిస్టేబుల్ స్థాయి సాధించడం తమ తోటివారికి స్ఫూర్తిదాయకమన్నారు. మీరు చూపిన ఆత్మవిశ్వాసం, పట్టుదల యువతకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ఉద్యోగంలోకి వచ్చిన తరువాత కూడా అదే ఆదర్శాన్ని కొనసాగిస్తూ నియమ నిబద్ధతతో ప్రజలకు సేవ చేయాలన్నారు. అలాగే పోలీస్ వ్యవస్థలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కూడా చాలా కీలకం కావడంతో అందులో నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. జి సంజీవ్, సి గంగాధర్, బి విజయ్ కుమార్ నాయకు, టిఎం ఖాజాఫీర్, ఎం నరసింహులు కానిస్టేబుల్ ఉద్యోగాలను పొందిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం వెంకటాద్రి, ఏఆర్ డీఎస్పీ ఎం శ్రీనివాసులు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎం పెద్దయ్యలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాతోనే విద్యార్థులు మృతి

ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి


విద్యార్థుల తల్లిదండ్రులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : చెయ్యేరులోని ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడ దొరికితే అక్కడ అక్రమంగా తరలించటం వలనే ఇంజినీరింగ్ విద్యార్థులు బలి అయ్యారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి అభిప్రాయపడ్డారు. మండల పరిధిలోని బాలరాజుపల్లి వద్ద గల చెయ్యేరులోకి దిగి అన్నమాచార్య యూనివర్సిటీలో విద్యనభ్యసిస్తున్న ముగ్గురు విద్యార్థులు గురువారం మృతి చెందారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఉన్న వారి మృత దేహాలను శుక్రవారం ఎమ్మెల్యే ఆకేపాటి చూసి చలించిపోయారు. వారికి నివాళులు అర్పించి వారి తల్లిదండ్రులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైద్యులు డాక్టర్ అనీల్‌కుమార్‌తో చర్చించి వేగంగా పోస్టు మార్టం పనులు పూర్తి చేసి మృతి చెందినవారి తల్లిదండ్రులకు సహకరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే ఆకేపాటి మాట్లాడతూ ఎన్నో ఆశలతో విద్యనిభ్యశిస్తున్న విద్యార్థులు మృతి చెందటం భాదాకరమన్నారు. వారి తల్లిదండ్రుల కలలను నేరవేర్చే క్రమంలో ఈతకు వెళ్లి మృతి చెందటం విచారకరమన్నారు. మృతి చెందిన వారిలో రాజంపేట మండలం గాలివారిపల్లి చెందిన సోంబెత్తిన దిలీప్ కుమార్, ఒంటిమిట్ట మండలం మడపంపల్లికి చెందిన కొత్తూరు చంద్రశేఖరరెడ్డి , పోరుమామిళ్లకు చెందిన పీనరోతు కేశవ ఉన్నారన్నారు. వీరికి ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. ఆకేపాటి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు పీ.విశ్వనాథరెడ్డి, దండు గోపీ, దాసరి పెంచలయ్య, జీవీ సుబ్బరాజు, మల్లికార్జునరెడ్డి, న్యాయవాదులు మూరి గోవర్ధన రెడ్డి, పాటూరు భరత్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మందలించిన ఉపాధ్యాయుడిపై తల్లిదండ్రుల తిరుగుబాటు

ఒంటిమిట్ట : మండల కేంద్రమైన ఒంటిమిట్టలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఓ విద్యార్థి పాఠశాలకు రావడం లేదని మందలించిన ఉపాధ్యాయుడిపై బాధిత విద్యార్థి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తిరగబడి దాడి చేసినట్లు సమాచారం. స్థానికులు, తోటి విద్యార్థులు తెలిపిన వివరాల మేరకు.. ఒంటిమిట్ట జడ్పీ హెచ్‌ఎస్‌లో ఏడోతరగతి చదువుతున్న విద్యార్థి పాఠశాలకు రాకుండా తరగతి గదిలో పుస్తకాలతో కూడిన బ్యాగును పెట్టి బయట తిరుగుతూ ఉండేవాడు. ఇది గమనించిన పాఠశాల ఉపాధ్యాయుడు శుక్రవారం పాఠశాలకు రాకుండా దుమ్మా కొడుతున్న విద్యార్థిని పట్టుకొని రెండు దెబ్బలు వేసి గట్టిగా మందలించాడు. ఈ విషయాన్ని దెబ్బలు తిన్న విద్యార్థి తన తల్లిదండ్రులకు ఏడుస్తూ వెళ్లి చెప్పడంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు తన కుమారుని కొట్టిన పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుడి వద్దకు వెళ్లి తీవ్ర వాగ్వాదానికి దిగి దాడి చేశారని తెలిసింది. విషయం ఒంటిమిట్ట పోలీసుల వరకు కూడా వెళ్లినట్లు సమాచారం. దీనిపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

చోరీకుల పాల్పడే ముఠా అరెస్టు

– కలికిరి సమీపంలో

నాటుకోళ్లు చోరీచేస్తూ పట్టుబడిన వైనం

కలికిరి : పల్లెలలో పూసలమ్ముతూ అదును చూసి చోరీలకు పాల్పడుతున్న ముఠా ఆట కట్టించారు కలికిరి పోలీసులు. వివరాల్లోకి వెళితే.. వైఎస్సార్ కడప జిల్లా లక్కిరెడ్డిపల్లి మండలానికి చెందిన సంచార జాతులకు చెందిన ఆవుల రామయ్య, సనపతి రమేష్, ముగ్గురు మహిళలు ఆవుల రత్నమ్మ, ఆవుల సరోజమ్మ, సనపతి అంజనమ్మ లు పల్లెలకు తిరుగుతూ పూసలమ్ముతుంటారు. ఈ క్రమంలో ఈ నెల 20న కలికిరి పంచాయతీ తుమ్మలపేట వడ్డిపల్లికి వచ్చి పూసలు విక్రయించడానికి పల్లె అంతాతిరిగారు. ఓ ఇంటి వద్ద నాటుకోళ్ళు ఉన్నట్లు గుర్తించి, పక్కా పథకంతో నాటుకోళ్ళకు మత్తుమందు కలిపిన గింజలు వేసి అవి మత్తుతో నేలకొరిగిన తరువాత వాటిని సంచుల్లో వేసుకొని తీసుకెళుతున్నారు. అదే గ్రామానికి చెందిన చంద్రశేఖర్ గమనించి ముగ్గురు మహిళలను గ్రామస్తుల సహాయంతో పట్టుకున్నారు. వేరొక ప్రాంతంలో ఉన్న మరో ఇద్దరు మగవారికి పట్టుబడ్డ మహిళలు సమాచారమిచ్చారు. ద్విచక్రవాహనాల్లో వచ్చిన వారు ఒక ద్విచక్రవాహనంలో ఇద్దరు మహిళలను తీసుకుని గ్రామస్తుల నుంచి చాకచక్యంగా తప్పించుకుని పారిపోయారు. మరో ద్విచక్రవాహనంలో పారిపోతుండగా గ్రామస్తులు పట్టుకున్నారు. దీంతో మరో ఇద్దరు వాహనాన్ని, పట్టుకున్న నాటుకోళ్ళను వదిలి పరారయ్యారు. ఈ మేరకు చంద్రశేఖర్ పోలీసులకు పిర్యాదు చేశాడు. నిందితులు ఇంకా పలురకాల చోరీలకు పాల్పడుతున్నట్లు గ్రామస్తులు పోలీసులకు తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులలో మహిళలను సరోజమ్మ, అంజనమ్మ, రత్నమ్మలను అదుపులోకి అరెస్టు చేసి కోర్టుకు తరలించగా నిందితులకు రిమాండ్ విధించినట్లు తెలిపారు. మిగిలిన ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

హత్యచేసి చంపేశారని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు


మృతిచెందిన అశ్విని

మదనపల్లె రూరల్ : వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన శుక్రవారం కురబలకోట మండలంలో జరిగింది. బి.కొత్తకోట మండలం గట్టుపంచాయతీ దేవరాజుపల్లెకు చెందిన వెంకటేశ్వరరెడ్డి, పాపులమ్మ దంపతుల కుమార్తె అశ్విని(28)ను పదేళ్ల క్రితం కురబలకోట మండలం ముదివేడు క్రాస్ బద్దిపల్లెకు చెందిన ఆనందరెడ్డితో వివాహం జరిపించారు. వీరికి హారతి(6), సూర్యవర్ధన్‌రెడ్డి(4), మరో ఏడాది పాప ఉన్నారు. ఆనందరెడ్డి వ్యవసాయపనులు చేస్తుంటాడు. అయితే ఇటీవల కొంతకాలంగా కుటుంబసమస్యలతో వివాదాలు ఏర్పడి తరచూ గొడవపడేవారు. శుక్రవారం సాయంత్రం స్థానికులు కొందరు అశ్విని తల్లిదండ్రులకు ఫోన్‌చేసి కరెంట్‌షాక్‌తో కుమార్తె మృతి చెందినట్లు సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన కుటుంబసభ్యులు బద్దిపల్లెకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అశ్విని గొంతుపై ఉరివేసుకున్న ఆనవాళ్లు స్పష్టంగా కనిపించడంతో కుమార్తె మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. కుటుంబంలో తరచూ జరుగుతున్న గొడవల కారణంగా అత్తింటివారే తమ కుమార్తెను ఉరివేసి చంపేశారని ఆరోపిస్తూ కురబలకోట పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదుమేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముదివేడు పోలీసులు తెలిపారు.

దేవదాయ ఆక్రమణదారులకు నోటీసులు

- జీసీహాస్టల్ తరలింపునకు ప్రతిపాదన
- జిల్లా అధికారి విశ్వనాథ్

బి.కొత్తకోట : జిల్లాలో దేవదాయశాఖ భూములను ఆక్రమించిన 50 మంది ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశామని ఆ శాఖ జిల్లా అధికారి విశ్వనాథ్ తెలిపారు. శుక్రవారం ఆయన మండల ప్రత్యేకాధికారిగా స్థానిక సీహెచ్‌సీ, ఇందిరమ్మ కాలనీలోని బీసీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. హాస్టల్‌లో 15 మంది విద్యార్థులు ఉండాల్సివుండగా 10 మంది ఉన్నట్లు గుర్తించారు. ఈ హాస్టల్‌ను బి.కొత్తకోట పట్టణంలోకి తరలించి, దీన్ని జూనియర్ కళాశాల విద్యార్థుల హాస్టల్‌కు ఇచ్చేలా ప్రతిపాదనలు పంపామని విశ్వనాథ్ చెప్పారు. సీహెచ్‌సీలో రోగులకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. ఉచితంగా ఇస్తున్న ఔషధాల కేంద్రం పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది పనితీరును ప్రశంసించారు. వైద్యులు ఆరీఫుల్లా రోగులు పొందుతున్న చికిత్సల వివరాలను తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవదాయ భూములు ఆక్రమించిన వారికి జారీ చేసిన నోటీసులకు నలుగురు ట్రిబ్యూనల్‌ను ఆశ్రయించారని, మిగిలిన వారు ఇంకా సంజాయిషీ ఇవ్వలేదని చెప్పారు. స్థానిక చౌడేశ్వర, ఆంజనేయస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు స్థపతులను ఇక్కడికి రప్పించి ఆలయాలను పరిశీలించాక అంచనా వ్యయంపై నివేదికలను ప్రభుత్వానికి పంపి నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బాధితులకు న్యాయం జరగాలి


సమీక్షా సమావేశంలో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపరిచి బాధితులకు న్యాయం జరిగేలా, సాక్ష్యాధారాలతో నేర నిరూపణ చేసి నిందితులకు శిక్షపడేలా పనిచేయాలని జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు కోర్టు మానిటరింగ్ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. శుక్రవారం స్థానిక పోలీసు సమావేశ మందిరంలో జిల్లాలోని కోర్టు మానిటరింగ్ సిబ్బంది, పోలీసు స్టేషన్లకు చెందిన కోర్టు కానిస్టేబుళ్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉన్నతాధికారులకు నివేదించాలని ఆదేశించారు. కోర్టులలో చార్జ్ షీటు ఫైల్ చేసిన అనంతరం కోర్టు ద్వారా సంబంధిత కేసులలో సిసి నెంబర్లను తీసుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు పెండింగ్ సమన్లు జారీ అయ్యేలా, వారెంట్లు అమలు జరిగేలా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నూతనంగా అమలులోకి వచ్చిన బీఎన్ఎస్ఎస్ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి కోర్టు కానిస్టేబుల్ విధిగా తన పోలీసు స్టేషన్‌కు సంబంధించి కోర్టులో హాజరవుతున్న ప్రతి కేసు గురించి అవగాహన పెంచుకొని సరియైన సాక్ష్యాధారాలతో నిందితులకు శిక్షపడేలా చూడాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎం వెంకటాద్రి, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ ఎ ఆదినారాయణ రెడ్డి, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ ఎం తులసీరామ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పి రాజా, రమేష్, టాస్క్‌ఫోర్సు ఇన్‌స్పెక్టర్ టి మధు, ఎస్ఐ జి రవికుమార్, కోర్టు మానిటరింగ్ సిబ్బంది, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్‌రావు


మాట్లాడుతున్న సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఛైర్మన్ డైరెక్టర్ సంతోష్‌రావు

రాయచోటి : మెరుగైన సేవలతో నాణ్యమైన విద్యుత్ సరఫరాను నిరంతరాయంగా అందించేలా చర్యలు చేపట్టాలని సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్‌రావు ఆదేశించారు. శుక్రవారం రాయచోటిలో జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాసానుకూల అవగాహనపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కె.సంతోష్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సదస్సుకు జిల్లాలోని రాయచోటి, రాజంపేట, పీలేరు, మదనపల్లి డివిజన్లలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. వినియోగదారులు సంస్థకు దేవుళ్లతో సమానమని కె.సంతోష్‌రావు అన్నారు. వారికి మెరుగైన సేవలందించే క్రమంలో విద్యుత్ సరఫరాను అంతరాయం లేకుండా, లోవోల్టేజీ సమస్య రాకుండా చూడాలన్నారు. ఉద్యోగులు కార్మికులు వారి పనిచేసే ప్రాంతాల్లో నివాసం ఉంటూ వినియోగదారులకు అందుబాటులో ఉండాలని సూచించారు. అలా లేని వారిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా విద్యుత్ వినియోగదారులతో సత్సంబంధాలను కొనసాగించాలని తెలిపారు. అర్బన్, మండల హెడ్ క్వార్టలలో లో వోల్టేజీ సమస్య ఉన్న ప్రాంతాలలో అదనపు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చాలన్నారు. సదస్సులో చీఫ్ జనరల్ మేనేజర్ జానకిరామ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనపై మండల అధికారులు, సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పి.యుగంధర్, ఈశ్వర్‌రెడ్డి, వై.చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, గంగాధర్, డిప్యూటీ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, అధికారులు, కార్మికులు సదస్సులో పాల్గొన్నారు.

ఆ ముగ్గురికి మాత్రం చార్జిమెమోలా?

– కడప కేంద్ర కారాగారంలోనైతే 'ఏడుగురు' సస్పెన్షనా

కడప టాస్క్‌ఫోర్స్ : వైఎస్ఆర్ జిల్లాలో జైళ్లశాఖ అధికారుల చర్యలు ఒక్కో వ్యవహారంలో ఒక్కో విధంగా వ్యవహరిస్తున్నారనీ ఆరోపణలు వినిపిస్తున్నాయి. కడప కేంద్ర కారాగారంలో ఇటీవల పిడియాక్ట్ రిమాండ్ ఖైదీ జాకీర్ వద్ద దశల వారిగా 12 సెల్‌ఫోన్‌లు, ఒక చార్జర్ లభించాయి. ఈ సంఘటన ను చక్కదిద్దడానికి క్రమశిక్షణా చర్యల క్రింద ఇద్దరు డిప్యూటీ సూపరింటెండెంట్లు, ఇద్దరు జైలర్లు, ముగ్గురు వార్డర్లను సస్పెన్షన్ చేస్తూ విచారణ అధికారిగా వచ్చిన డిఐజీ ఎ.ఆర్ రవికిరణ్ నివేదిక మేరకు రాష్ట్ర డిజి సస్పెన్షన్ వేటు వేశారు. తరువాత రోజుల తరబడిగా విచారణ కొనసాగుతోంది. సాక్షాత్తు రాష్ట్ర డిజి అంజనీకుమార్ కడప కేంద్ర కారాగారంకు వచ్చి విచారణ చేశారు. తరువాత ఇటీవల ప్రొద్దుటూరు సబ్‌జైలుకు చోరీల కేసుల్లో మహమ్మద్ రఫీ అనే 32 కేసులున్న నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈనెల 16తేదీన తెల్లవారు జామునే రిమాండ్‌ఖైదీ పరారయ్యాడు. వారిపై విచారణ అధికారి హుటాహుటిన వెళ్లి సమగ్రంగా విచారణ చేపట్టారు. ఈ క్రమంలోనే అక్కడ పనిచేస్తున్న ముగ్గురికి 'చార్జ్‌మెమోలు' ఇచ్చి 'మమ' అనిపించారు. కడప కేంద్ర కారాగారంలో ఏడుగురిని 'బాధ్యతా రాహిత్యం'గా వ్యవహరించారనీ నివేదికను పంపగా సస్పెన్షన్ చేశారు. రిమాండ్ ఖైదీని కడప కేంద్ర కారాగారంకు పంపించినా, ప్రొద్దుటూరు సబ్ జైలు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించినా 'రిమాండ్ ఖైదీ పరారీ' సంఘటన జరిగి వుండేది కాదనీ భావిస్తున్నారు. ప్రొద్దుటూరులోని ముగ్గురు సిబ్బందిలో ఒక హెడ్ వార్డర్‌కు కూటమి ప్రభుత్వానికి చెందిన ఓ ఎమ్మెల్యే అండదండలున్నాయనీ సమాచారం.

విద్యుదాఘాతంతో రైతు మృతి

మైలవరం : మండలపరిధిలోని వేపరాల గ్రామానికి చెందిన ఏరాసీ సుబ్బరామిరెడ్డి (59) విద్యుదా ఘాతంతో మృతిచెందిన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకొంది. వివరాలిలా... పెన్నానదిలో తన పొలం కోసం వేసుకున్న బోర్ వద్ద స్టాటర్ తోలగించడానికి వెళ్లి పొరపాటున కరంట్ వైర్లను పట్టుకొని సుబ్బిరామిరెడ్డి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరు కోర్టు కానిస్టేబుళ్ల సస్పెన్షన్..?

రాయచోటి : గ్యాంగ్ రేప్ కేసులో కోర్టుకు సాక్షులను సకాలంలో హాజరుపరచకపోవడంపై ఇద్దరు కోర్టు కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు పడినట్లు విశ్వసనీయ సమాచారం. సంబేపల్లి మండలం శెట్టిపల్లిలో 2021లో జరిగిన గ్యాంగ్ రేప్ కేసు కోర్టు పరిధిలో నడుస్తోంది. కోర్టుకు కేసులను సాక్షులను హాజరుపరచడంలో స్టేషన్ అధికారితో పాటు కోర్టు కానిస్టేబుల్ నిర్లక్ష్యం వహించారంటూ కోర్టు ఉన్నతాధికారులకు నివేధించింది. కోర్టు నివేదన మేరకు పోలీస్ ఉన్నతాధికారులు అన్నమయ్య జిల్లా పరిధిలోని సంబేపల్లి పీఎస్ కోర్టు కానిస్టేబుల్ అమరనాథ్, లక్కిరెడ్డిపల్లి పీఎస్ కోర్టు కానిస్టేబుల్ లక్ష్మీనరసయ్యలను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఎస్పీ కార్యాలయం నుంచి ఆదేశాలు వెలువడినట్లు తెలిసింది. ఈ సస్పెన్షన్ ఉత్తర్వులను గోప్యంగా వచ్చినట్లు పోలీసు వర్గాల సమాచారం. స్టేషన్ పరిధిలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకొని క్షేత్రస్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకొని, ఆపై స్థాయి అధికారుల పైన చర్యలు లేకపోవడంపై పోలీసు వర్గాలలో విమర్శలు వినిపిస్తున్నాయి. కానిస్టేబుల్స్ సస్పెన్షన్ విషయాన్ని డీఎస్పీ కృష్ణమోహన్‌ను వివరణ కోరగా తనకు ఇంకా సమాచారం రాలేదని తెలిపారు.

విద్యార్థుల మృతిపై ఎంపీ మేడా తీవ్ర విచారం

- మృతుల కుటుంబాలకు రూ. 50 వేల సాయం
- ఎంపీ మేడా రఘునాథ రెడ్డి



రాజంపేట (ఒంటిమిట్ట) : రాజంపేట మండల పరిధిలోని బాలరాజుపల్లి చెయ్యేరు నదిలో ఎనిమిది మంది విద్యార్థులు ఈతకు వెళ్లి ముగ్గురు విద్యార్థులు ఇసుక ఊబిలో చిక్కుకొని మృతి చెందిన ఘటనపై రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు వారు తమ ప్రగాఢ సానుభూతి తెలిపి మృతులకు సంబంధించిన బాధిత కుటుంబాలు ఒక్కొక్కరికి రూ. 50 వేలు చొప్పున తమవంతు సహాయంగా ప్రకటించారు. ప్రస్తుతం భారీ వర్షాలు కురిసి వాగులు, వంకలు చెరువులలో నీటి ప్రవాహం ఉధృత్తంగా ఉందని, ఈతకు వెళ్లే యువకులు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలు, విద్యార్థులు సరదాగా, ఆకతాయితనంగా ఈతకు వెళ్లి ఇలా మృతి చెందితే తల్లిదండ్రులకు తీరని కడుపుకోత మిగిలిస్తాయన్నారు. ప్రభుత్వం అనుమతి ఇస్తే రాజంపేట నియోజకవర్గంలో తన సొంత ఖర్చులతో స్విమ్మింగ్ పూల్స్ ఏర్పాటు చేసి ఈత నేర్చుకోవాలన్న వారికి అందుబాటులో ఉంచుతామన్నారు.